# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
వాస్తవ నేస్తం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
• జిల్లా బ్యూరో చీఫ్‌లు
• జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
• నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
• మండల రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979





సంపుటి : 2 సంచిక : 326 బుధవారం 24 జూలై 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# మహిళలకు పెద్దపీట

- మొత్తం ఆదాయాన్ని రూ.32.07 లక్షల కోట్లు
- దానిలో పన్ను ఆదాయాన్ని రూ.28.83 లక్షల కోట్లు
- అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు
- యథాతథంగా క్యాపిటల్ ఎక్స్ పెండిచర్
- తగ్గిన క్యాన్సర్ మందులు, మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు, బంగారం, వెండి ధరలు
- ప్లాస్టిక్ ఐటమ్‌లు, పవీసీ ఫ్లెక్స్ బ్యానర్లు, సోలార్ గ్లాస్, టిన్డ్ కాపర్ ధరలు పెరుగుదల



**రూ.48.21 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్**



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో కేంద్రం మహిళలకు, బాలికలకు పెద్దపీట వేసింది. వీరికి లబ్ధి చేకూరేలా ఏకంగా రూ. 3 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వర్క్‌ఫోర్స్‌లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు, వర్కింగ్ మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం హాస్టళ్లను ఏర్పాటు చేయనుందని మంత్రి తెలిపారు.

కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త బడ్జెట్ కారణంగా దేశంలో బంగారం, వెండి ధరలు తగ్గనున్నాయి. అలాగే స్మార్ట్ ఫోన్‌ల ధరలు కూడా తగ్గే జాబితాలో ఉన్నాయి. సెల్‌ఫోన్లపై 15 శాతం కస్టమ్ డ్యూటీ తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే లెదర్ ఉత్పత్తులపై పన్ను శాతం తగ్గించనున్నారు. వీటితో పాటు మూడు క్యాన్సర్ మందులపై జీఎస్టీ తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఎక్స్‌రే మిషన్లపై జీఎస్టీ తగ్గించనున్నారు. ఇక 25 రకాల కీలక ఖనిజాలపై కస్టమ్ డ్యూటీతో పాటు, సోలార్ ఉత్పత్తులపై కస్టమ్ డ్యూటీ తగ్గించనున్నారు. ఈ ఏడాది మొత్తం రూ.32.07 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టింది.


- లో




## కేంద్ర బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరం

- రూ. 48 లక్షలు ఇరవై ఒక్కవేల కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారు
- తెలంగాణ రాష్ట్రానికి మరొకసారి దక్కింది గుండు సున్నానే
- రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేకపోవటం లేదు
- తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు వెళ్లి ఢిల్లీలో అడిగిన వాటిని కూడా పట్టించుకోలేదు.

# మా ప్లాన్ మాకుంది!



- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష.. రేవంత్ రెండు కీలక నిర్ణయాలు
- తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా, రాష్ట్ర హక్కులను కాపాడేలా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడతామని వెల్లడి
- ఇది నాయుడు, నితీష్ డిపెండెంట్ అలయన్స్
- కాంగ్రెస్ ఎంపీలతో పాటు మిగతా పార్టీల ఎంపీలు పార్లమెంట్లో నిరసన చేయాలి
- కేంద్ర బడ్జెట్ కక్షపై పార్లమెంట్, అసెంబ్లీలో కార్యాచరణ ఉంటుంది
- బండి సంజయ్, కిషన్ రెడ్డి బానిసలాగా కాకుండా, తెలంగాణ పౌరునిగా ఆలోచించాలి
- మోదీ.. ఇది సరికాదు.. కేంద్ర బడ్జెట్‌పై రేవంత్ ఫైర్
- మా మంత్రులు కూడా కేంద్ర మంత్రులను కలిశారు
- 18 సార్లు ఢిల్లీ వెళ్లి నిధులు ఇవ్వాలని కోరాం.

**హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్-2024లో తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా, రాష్ట్ర హక్కులను కాపాడేలా బుధవారం నాడు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడతామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి.. కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కేంద్ర బడ్జెట్ 'కుర్చీ బచావో బడ్జెట్' లాగా ఉందని విమర్శలు గుప్పించారు. ఇంత కక్షపూరిత బడ్జెట్ గతంలో తాను ఎప్పుడూ లేదన్నారు. తెలంగాణ ఓట్లు, సీట్లు మాత్రమే బీజేపీకి కావాలని ఎన్నికల ముందే చెప్పిన విషయాన్ని మరోసారి రేవంత్ గుర్తు చేశారు. ఇది నాయుడు, నితీష్ డిపెండెంట్ అలయన్స్. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల కక్షపై అసెంబ్లీలో చర్చకు తీర్మానం చేయాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించాం. కాంగ్రెస్ ఎంపీలతో పాటు మిగతా పార్టీల ఎంపీలు పార్లమెంట్లో నిరసన చేయాలి. కేంద్ర బడ్జెట్ కక్షపై పార్లమెంట్, అసెంబ్లీలో- మిగతా3లో


# ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ఆచరణతో ముందుకు పోతున్నాం



- ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చకు ప్రభుత్వం వెనక్కిపోదని స్పష్టం
- జూలై 31తేదీ లోగా బడ్జెట్‌కు సంబంధించి అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లు పెట్టాలని నిర్ణయం
- అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చర్చకు అవకాశం
- లా అండ్ ఆర్డర్ , రుణమాఫీ, స్థానిక సంస్థలపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

**హైదరాబాద్**

రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులను కాపాడుకోవడంలో కేంద్రంపై పోరాటం చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాజకీయ కోణంలో రాష్ట్రానికి అన్యాయం చేయొద్దని కోరారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చకు ప్రభుత్వం వెనక్కిపోదని స్పష్టం చేశారు. జూలై 31తేదీ లోగా బడ్జెట్‌కు సంబంధించి అసెంబ్లీలో ద్రవ్య వినిమయ బిల్లు పెట్టాలని నిర్ణయించినట్లు.. ఆ లోపు బిల్లును పెట్టకుంటే జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుందని అన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చర్చకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం స్పీకర్‌ని కోరిందని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు ఎక్కువ రోజులు జరపాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావుకి అసెంబ్లీ ప్రొసీడింగ్స్ అన్నీ తెలుసునని అన్నారు. తిమ్మిని బమ్మిని చేయాలని బీఆర్ఎస్ నాయకులు చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సమయం ఉన్నా 8 రోజుల కన్నా ఎక్కువ రోజులు అసెంబ్లీని జరపలేదని చెప్పారు. తమ ప్రభుత్వం - మిగతా3లో




## నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదు

- పరీక్ష నిర్వహణలో వ్యవస్థాపరమైన లోపాలు ఉన్న మాట వాస్తవమే
- అయితే ఈ లోపం వల్ల కేవలం 155 మంది అభ్యర్థులు లబ్ధి పొందారు
- మిగతా అభ్యర్థులందరికీ తిరిగి పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదు

# ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి





- క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం తీసుకోవాలి
- జిల్లా పాలనాధికారి రాజర్షి షా

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లాలో గాదిగూడ మండలం పరస్వాడ- కే మండల ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, గ్రోత్ ను పరిశీలించి గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో ఇస్తున్న పౌష్టికాహారాన్ని రోజు తింటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం బాగుంటుందని, బాలమృతం, కోడిగుడ్లు, అన్నం పప్పు రోజు తినాలని అన్నారు. మండల ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థుల హాజరును పరిశీలించి, విద్యార్థులతో పాఠాలు చదివించి, లెక్కలు చేయించారు. మూడు, ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు కనీస బేసిక్ రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వార చేపడుతున్న నిర్మాణ పనులను పరిశీలించి పనులు, సరిగా లేక,నీటి సౌకర్యం లేకపోవడం తో మీ ఇంట్లో అయితే ఇలాగే చేస్తారా అని , విద్యార్థులకు చదవడం, వ్రాయడం రావడం లేదని ప్రధానోపాధ్యాయు రాలు రామాబిందు మందలించారు. హెచ్ఎం తో పాటు గ్రామ పంచాయితీ సెక్రటరీ పాఠశాల సందర్శించి విద్యార్థులకు బేసిక్ నేర్పించాలని అన్నారు. అనంతరం ధర్మ గుడ కల్వర్టు ను పరిశీలించి గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా రాకపోకలకు అంతరాయం కలగకుండా వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పైపులు వేసి రెండురోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి అర్జుని గ్రామ పంచాయితీ మారుగుడ పెద్ద వాగును పరిశీలించి రెండు నెలలకు సరిపడ సరుకులు ముందుగానే సరఫరా చేయాలని, ఇదివరకే చెప్పడం జరిగిందని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లల కు ఇబ్బంది కలగకుండా అంగన్వాడి ద్వారా పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేసి డ్రగ్స్ స్టోరేజ్, వైద్యాధికారుల హాజరు రిజిష్టర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయానందం, ఎంపిడిఒ, వైద్యాధికారులు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ సబ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ, బీహార్‌కు భారీగా నిధులు



**న్యూఢిల్లీ :** ఎన్డీయే 3.0 కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామ్యంగా ఉన్న ఏపీ, బీహార్‌లకు కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ) వరాల జల్లు కురిపించారు. ఏపీలో రాజధాని అమరావతికిప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. అలాగే, నితీశ్ కుమార్ నేతృత్వంలోని బీహార్‌కు పలు అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రకటించారు. అయితే, బీహార్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలన్న డిమాండ్‌ను మాత్రం కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బీహార్‌లో వివిద ప్రాజెక్టుల కోసం రూ.26 వేల కోట్లు కేటాయించారు. అక్కడ ఎయిర్ పోర్టులు, విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అలాగే, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల అభివృద్ధికి కూడా ప్రణాళిక రూపొందిస్తామన్నారు.కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఏపీకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఈసారి బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించారు. విభజన తర్వాత ఆర్థికంగా నష్టపోయిన రాష్ట్రానికి ఆర్థిక సాయం ప్రకటించి చేయూత అందించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి పూర్తిగా సాయం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, రైతులకు పోలవరం జీవనాడి అని.. భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైనదని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వెంటనే జరిగేలా చూస్తామన్నారు.

ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు నిర్మలమ్మ తెలిపారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయిస్తామన్నారు. అలాగే, విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి సహకారం అందిస్తామని అన్నారు. హైదరాబాద్ – బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం చేస్తామన్నారు. అలాగే, రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని వెల్లడించారు.బీహార్‌లో కొత్త విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఆర్థిక సాయం. పీర్ పాయింట్ వద్ద 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో సహా విద్యుత్ ప్రాజెక్టులు చేపడతారు.

గయాలో ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి, పాట్నా – పూర్ణియా ఎక్స్ ప్రెస్ వే, బక్సర్ – భాగల్పూర్ హైవే, బోద్‌గయా – రాజ్‌గిర్ – వైశాలి – దర్భంగా, బక్సర్‌లో గంగానదిపై రూ.26 వేల కోట్లతో వంతెనల అభివృద్ధికి సాయం చేస్తామని నిర్మలమ్మ ప్రకటించారు.

ఆక్సిలరేటెడ్ ఇరిగేషన్ ఫండ్ ద్వారా బీహార్‌లో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తామన్నారు. అలాగే, టెంపుల్ కారిడార్లు, నలంద యూనివర్శిటీ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

టీడీపీ నేతల ధన్యవాదాలు

ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కింది. అమరావతికి రూ. పదిహేను వేల కోట్లు ప్రకటించడంతో పాటు పోలవరం ప్రాజెక్టు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ప్రకటించారు. పోలవరానికి పెట్టే ప్రతి ఖర్చు నాబార్డు ద్వారా రీఎంబర్స్ చేస్తారు కాబట్టి బడ్జెట్ లో ప్రత్యేకంగా ఎంత మొత్తం అని చెప్పలేదు. ఇంకా ఏపీకి పారిశ్రామిక కారిడార్లు కూడా ప్రకటించారు. ఈ కేటాయింపులపై టీడీపీ నేతలు సంతృప్తి ప్రకటించారు. అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తి కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతూ నారా లోకేష్ ట్వీట్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక సాయం ప్రకటించడంపై మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సంతృప్తి వెలిబుచ్చారు. ఏపీ ఆశించినవన్నీ కేంద్ర బడ్జెట్‌లో పొందుపరిచారన్నారు. అమరావతికి రూ. 15 వేల కోట్లు ఇవ్వడంతో రాజధాని పనులను పరుగులు పెడతాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కేంద్రం మరోసారి స్పష్టంగా హామీ ఇవ్వడం .. ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాలకు నిధులిస్తామని చెప్పడం రాష్ట్ర ప్రగతికి తొడ్పడుతుందని విశ్లేషించారు. ఏ ఏపీలో పారిశ్రామిక మౌళిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వడం వల్ల పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు పుంజుకునేలా కేంద్ర బడ్జెట్ లఉందన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధితో పాటు ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా కేటాయింపులు చేశారనితాయని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంతోషం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్లు కేటాయించిన ఔఆం ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృ?తజ్ఞతలుతెలిపారు. వెనుకబడిన ప్రాంతాలకు రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించారని దీని వల్ల అన్ని ప్రాంతాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రేదశ్ కు కేంద్రం ప్రత్యేక సాయం చేయడంపై జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి ( సంతోషం వ్యక్తం చేశారు. జనసేన తరపున కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటన జారీ చచే?శారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న అమరావతికి రూ. 15 వేల కోట్లు ఇస్తామని ప్రకటించారని.. పోలవరం ప్రాజెక్టుకు 200 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పూర్తి ఖర్చు కేంద్రం భరిస్తుందని చెప్పారని .. ..దేశానికి ఆహార భద్రత కల్పించాలంటే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలి అని కేంద్ర మంత్రి చెప్పారని గుర్తు చేశారు. ఇవన్నీ ఏపీకి ఎంతో మేలు చేస్తాయన్నారు.

## ప్రత్యేక హోదా అడిగాం కానీ.. నితీష్ రియాక్షన్

పాట్నా: బీహార్‌కు ప్రత్యేక హోదాపై కేంద్ర బడ్జెట్ (%ఖఅఙశీఅ దీబస్రవ్% 2024)లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎలాంటి ప్రతిపాదన చేయకపోవడంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ స్పందించారు. ప్రత్యేక హోదా కానీ, స్పెషల్ ప్యాకేజీ కానీ ఇవ్వాలని ఎన్డీయే నేతలకు తాను చెప్పానని, ఆ క్రమంలోనే బీహార్ అభివృద్ధికి పలు కీలక కేటాయింపులు ప్రకటించారని చెప్పారు. "ప్రత్యేక హోదా గురించి బీజేపీతో సహా ఎన్డీయే నేతలకు పదేపదే కోరుతూనే వచ్చా. ప్రత్యేక హోదా కానీ ప్రత్యేక ప్యాకేజీ కానీ ఇవ్వాలని కోరాను. దానికి కొనసాగింపు గానే రాష్ట్రానికి బడ్జెట్‌లో పలు కీలక కేటాయింపులు ప్రకటించారు. ప్రత్యేక హోదా గురించి చాలా మందితో మాట్లాడటం జరిగింది. అయితే చాలాకాలం క్రితమే ప్రత్యేక హోదా అంశాన్ని దూరంగా పెట్టేశారని వారు చెప్పారు. హోదాకు బదులుగా బీహార్ అభివృద్ధికి సాయం ప్రకటించాల్సి ఉంటుంది. ఇప్పుడే అది మొదలైంది" అని మీడియాతో మాట్లాడుతూ నితీష్ చెప్పారు. కాగా, బీహార్‌కు ప్రకటించిన పథకాల అమలు తర్వాత బీహార్‌లో అభివృద్ధి రేటు గణనీయంగా పెరుగుతుందని జేడీయూ ఎంపీ, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ తెలిపారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, నీటిపారుదల, పర్యాటక రంగం సహా పలు రంగంలో అభివృద్ధి చోటుచేసుకుంటుందన్నారు. నిర్మలా సీతారామన్ మంగళవారంనాడు లోక్‌సభకు సమర్పించిన బడ్జెట్‌లో బీహార్ అభివృద్ధికి పలు చర్యలు ప్రకటించారు. వారణాసిలోని విశ్వనాథుని ఆలయం తరహాలో బిహార్‌లోని బుద్ద గయాలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బుద్ద గయాలో ఏర్పాటు చేసే ఆలయం వారణాసిలోని ఆలయాన్ని ప్రతిబింబించే విధంగా ఉంటుందని వివరించారు. రాజ్‌గిర్‌లోని జైన్ దేవాలయానికి సైతం ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. బిహార్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## అయోధ్య రామాలయంలో రోస్టర్ విధానంపై వెనక్కి!



అయోధ్య రామ మందిరంలో కొత్తగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జారీ చేసిన రోస్టర్‌ను నిలిపిశారు. అర్చకులు గతంలోనే మాదిరిగానే రాంలల్లాకు పూజలు చేస్తారని తెలిపారు. అర్చకుల నుంచి రోస్టర్ విధానంపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అమలును వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అర్చకులందరూ ట్రస్టుకు ఇచ్చిన లేఖతో ట్రస్టు తన నిర్ణయాన్ని ఉప సంహరించుకుంటుందని ఆలయ ప్రధాన అర్చకులు ఆచార్య సత్యేంద్ర దాస్ వెల్లడించారు. ప్రస్తుతం అర్చకులు అంతా గతంలోనే మాదిరిగానే సేవ చేస్తారన్నారు. శ్రావణ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ అర్చకులతో సమావేశం నిర్వహించింది. వారిని నాలుగు గ్రూపులుగా విభజించింది. రామమందిరం, కుబేర్ తిల, యజ్ఞశాల స్థలంలో పది గంటల పాటు విధుల్లో ఉండాలని షరతు విధించింది. శ్రీరామ జన్మభూమి కాంప్లెక్స్‌లో ఫలానా స్థలంలో విధులు కేటాయించిన అర్చకుడు మరో 15 రోజుల పాటు మరో ప్రాంతంలో పూజలు చేసేందుకు వీలుండదు. కుబేర్ తిల, యాగశాలలో పూజలు చేసే వారు గర్భాలయం వరకు వెళ్లేందుకు అవకాశం ఉండదు. దీని నుంచి అర్చకులంతా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నది. ఇటీవల అర్చకులకు డ్రెస్‌కోడ్‌ని సైతం అమలులోకి తీసుకువచ్చింది. త్వరలో ట్రస్టు ద్వారా అర్చకులందరికీ దుస్తులు అందజేయనున్నది. అలాగే, 25 మంది అర్చకులకు రామమందిర్ ట్రస్ట్ కీప్యాడ్ ఫోన్‌లను అందజేసింది. పూజారులు ఇకపై రామ మందిరంలో కీప్యాడ్ ఫోన్‌లను మాత్రమే అవకాశం ఉంది. ఆండ్రాయిడ్ ఫోన్ల వాడకాన్ని నిషేధించారు. గతవారం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ అర్చకులతో సమావేశం నిర్వహించి ప్రవర్తనా నియమావళిని అమలులోకి తీసుకువచ్చారు.

## దీనికంటే అంబానీల పెండ్లి వీడియో చూడటం బెటర్.. బడ్జెట్‌పై 'భారత్ పే' కో ఫౌండర్ సెటైర్లు




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూడటం కంటే అంబానీల పెండ్లి వేడుకకు సంబంధించిన వీడియోను మళ్లీ చూడటం బెటర్ అంటూ ప్రముఖ వ్యాపారవేత్త, 'భారత్ పే' సహ వ్యవస్థాపకుడైన అష్నీర్ గ్రోవర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రికార్డు స్థాయిలో ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలమ్మ పద్దుపై అష్నీర్ ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందిస్తూ.. 'బడ్జెట్ చూడటం పరమ బోరింగ్‌గా ఉంది. జీవం లేని అర్థం పర్థం లేని విధంగా అనిపిస్తోంది' అంటూ సెటైర్లు సంధించాడు. అంతేగాక.. 'మేం ఈసారి మనస్ఫూర్తిగా చేయలేకపోయాం. కానీ వచ్చే సారి ఇంకా బాగా చేస్తాం' అని ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సమయంలో వాళ్లు చెబితే బాగుండేది అంటూ కేంద్ర ప్రభుత్వ డొల్లతనాన్ని బయటపెట్టాడు. ఈ బడ్జెట్ సమావేశాలను చూడటం కంటే అంబానీల పెండ్లి వేడుకలకు సంబంధించిన క్యాసెట్‌ను మళ్లీ వీక్షించడం చాలా బెటర్ అంటూ వ్యంగ్యంగా స్పందించాడు. 'అంబానీల పెండ్లి చూస్తే సమయాన్ని బాగా వినియోగించుకున్నవాళ్లం అవుతాం' అని ట్వీట్‌లో రాసుకొచ్చాడు. 'ప్రజలు బడ్జెట్‌ను ఆశించేది ధరలు ఏమైనా తగ్గుతాయా? పెరుగుతాయా?, పన్నులు పెరుగుతున్నాయా? తగ్గుతున్నాయా? ఉద్యోగాలు, భవిష్యత్‌లో ఎలా ఖర్చు చేయాలనేదానిపైనే ఆలోచిస్తారని, కానీ తాజా బడ్జెట్‌లో అలాంటిదేమీ లేద'ని గ్రోవర్ ఘాటుగా స్పందించడం గమనార్హం. నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్న వాదనలు వినిపిస్తుండగా ఈ పద్దులో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. ఎన్డీయేలో భాగస్వామి పక్షాలైన తెలుగుదేశం, జనతాదళ్ (యు) ప్రాతినిథ్యం వహిస్తున్న ఏపీ, బీహార్‌కు భారీ కేటాయింపులు దక్కగా తెలంగాణకు కేంద్రం మరోసారి మొండిచేయి చూపింది.

## నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదు : సుప్రీంకోర్టు




నీట్–యూజీ పరీక్షను మళ్లి నిర్వహించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహణలో వ్యవస్థాపరమైన లోపాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే ఈ లోపం వల్ల కేవలం 155 మంది అభ్యర్థులు లబ్ధి పొందారని, దాని కారణంగా మిగతా అభ్యర్థులందరికీ తిరిగి పరీక్ష నిర్వహించాల్సిన అసవరం లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్నది. నీట్ పేపర్ లీకేజీ ద్వారా పరిమిత సంఖ్యలో మాత్రమే అభ్యర్థులు లబ్ధి పొందారని, ఆ లబ్ధిపొందిన అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించింది. పరీక్ష తిరిగి నిర్వహిస్తే మొత్తం 24 లక్షల మంది అభ్యర్థులు ఇబ్బందుల పాలవుతారని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు.

## ఇది ఓ దిక్కూదివానం లేని రాజకీయ పక్షపాత బడ్జెట్ : మమతాబెనర్జీ



ఇవాళ కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి తీవ్ర విమర్శలు చేశారు. ఈ బడ్జెట్ పూర్తిగా రాజకీయ పక్షపాత వైఖరితో కూడిన బడ్జెట్ అని ఆమె మండిపడ్డారు. ఈ బడ్జెట్‌కు ఒక దిక్కూదివానం లేదని, ఇది కేవలం పొలిటికల్ మిషన్ అని మమత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్ సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని వాళ్లు (బీజేపీ నేతలు) చెప్పుకుంటున్నారని, కానీ ఇది పూర్తిగా అంధకార బడ్జెట్ అని మమత విమర్శించారు. ఎన్నికల సందర్భంగా వాళ్లు (బీజేపీ నేతలు) చాలా పొడుగులు మాట్లాడుతారని, ఒక్కసారి ఓట్లు పడ్డాయంటే వాళ్లు అన్నీ మర్చిపోతారని ఆమె ఫైరయ్యారు. డార్జిలింగ్, కలింపాంగ్ ప్రజలకు అధికార బీజేపీ ద్రోహం చేసిందని మండిపడ్డారు. ఈ బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడే బడ్జెట్ కాదని, ఇది ప్రజా వ్యతిరేక, పేదల వ్యతిరేక బడ్జెట్ అని మమతాబెనర్జి విమర్శించారు. ఈ బడ్జెట్ కేవలం ఒక పార్టీకి మాత్రమే లబ్ధి చేకూర్చేలా ఉన్నదని, రాజకీయ పక్షపాతంతో అవసరమైన చోట అధిక కేటాయింపులు చేశారని, ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మొండి చేయి చూపించారని విమర్శించారు.

## సెక్యూరిటీని పిలవండి.. న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం



**న్యూఢిల్లీ:** 'నీట్'లో అవకతవకలపై మంగళవారంనాడు సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా మధ్యలో అవాంతరం కలిగించేందుకు ప్రయత్నించిన ఒక న్యాయవాదిపై సీజేఐ డీవై చంద్రచూడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సెక్యూరిటీని పిలవండి' అంటూ సీరియస్ అయ్యారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది మేథ్యూస్ నెడుంపర హాజరయ్యారు. మరో పిటిషనర్ తరఫున హాజరైన నరేంద్ర హుడా తన వాదన వినిపిస్తుండగా నెడుంపర అడ్డుపడ్డారు. తాను సీనియర్ మోస్ట్ న్యాయవాదినని, బెంచ్ అడిగిన ప్రశ్నకు తాను జవాబిస్తానని, తాను 'అమికస్'నని చెప్పారు. ఇందుకు సీజేఐ "నేను ఏ ఎమికస్‌ను నియమించలేదు" అని అన్నారు. నెడుంపర అక్కడితో ఆగకుండా.."మీరు నాకు గౌరవం ఇవ్వకుంటే, నేను వెళ్లిపోతాను" అన్నారు. సీజేఐ వెంటనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ "మిస్టర్ నెడుంపర, మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. మీరు గ్యాలరీతో మాట్లాడటం లేదు. నేను కోర్టు ఇన్‌చార్జిని. సెక్యూరిటీని పిలవండి...ఆయనను బయటకు పంపిస్తారు" అని అన్నారు. దీనికి మళ్లీ నెడుంపర "నేనే వెళ్లిపోతాను" అంటూ అందుకు సిద్ధపడ్డారు. సీజేఐ తిరిగి ఆగ్రహం వ్యక్తం చేస్తూ "నేను వెళ్లిపోతానని మీరు చెప్పకూడదు. 24 ఏళ్లుగా జ్యుడిషియరీని చూస్తున్నాను. కోర్టులో ప్రొసీడింగ్స్‌ను లాయర్లు ఎప్పుడూ డిక్టేట్ చేయరు" అని చెప్పారు. నెడియూరప్ప పట్టువీడకుండా "1979 నుంచి నేనూ జ్యుడిషియరీని చూస్తున్నాను" అనడంతో సీజేఐ తాను ఆదేశాలివ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఒక లాయర్ మాట్లాడుతుండగా మీరు ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. దీంతో నెడియూరప్ప బయటకు వెళ్లిపోయారు. ఆ కాసేపటికే తిరిగి వెనక్కి వచ్చారు. "సారీ.. నేను ఎలాంటి తప్పూ చేయలేదు, నన్ను అనుచితంగా ట్రీట్ చేశారు. నేను ఈ విషయం ఇంతటితో వదలిపెట్టేస్తున్నాను" అని చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

# మా ప్లాన్ మాకుంది..!

-మొదటిపేజీ తరువాయి

కార్యాచరణ ఉంటుంది. బండి సంజయ్, కిషన్ రెడ్డి బానిసలాగా కాకుండా, తెలంగాణ పౌరునిగా ఆలోచించాలి. పునర్విజన చట్టంలో తెలంగాణకు ఇవ్వాల్సినవి ఎందుకు ఇవ్వడం లేదో బండి సంజయ్, కిషన్ రెడ్డి చెప్పాలి. కేంద్రం నిధులు ఇవ్వకున్నా మా ప్రణాళికలు మాకు ఉన్నాయి. మోదీ పెద్దన్న లాగా కనిపించడం లేదు' అని రేవంత్ విమర్శించారు.

**కేసీఆర్‌పై ఇలా..**

ఇదే మీడియా సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్, సౌత్ ఇండియాపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు వ్యాఖ్యలు చేశారు. 'కేంద్ర బడ్జెట్ కక్షపై కలిసివచ్చేది ఎవరు..? చీకటి ఒప్పందాలు చేసుకుంది ఎవరు..? అనేది రేపు తేలిపోతుంది. కేసీఆర్ సభకి వస్తే తెలంగాణ ప్రజల కోసం నిలబడుతున్నట్లు లేదంటే కిషన్ రెడ్డితో కలిసి ఉన్నట్లు అర్థం చేసుకోవచ్చు. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం పెట్టాలని అనుకున్నాను. ఇప్పటికే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఈ విషయం మాట్లాడాను. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సానుకూలంగా స్పందించారు. దక్షిణాది రాష్ట్రాలు ఓట్లు వేసే యంత్రాలుగా కనిపిస్తున్నాయి' అని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

**మోదీ.. ఇది సరికాదు**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్-2024పై తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపిందని మండిపడ్డారు. తెలంగాణపై కేంద్రం కక్ష సాధించినట్లుందని.. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ' ప్రధాని తెలంగాణకు వస్తే స్వాగతం పలికి పెద్దన్న పాత్ర పోషించమని అడిగాను. పెద్దన్నలా ఉండాల్సిన ప్రధానికి ఇది సరికాదు. ఢిల్లీకి వెళ్లి



కేంద్రాన్ని నిధులు అడిగాం. ప్రధాని మోదీని నేనే మూడుసార్లు కలిసి అడిగాను. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను మెరుగుపరుద్దామని ప్రధానితో చెప్పాను. అయినా తెలంగాణకు అన్యాయం జరిగింది. మా మంత్రులు కూడా కేంద్ర మంత్రులను కలిశారు. 18 సార్లు ఢిల్లీ వెళ్లి నిధులు ఇవ్వాలని కోరాం. బడ్జెట్‌లో తెలంగాణ పదాన్ని నిషేధించారు. తెలంగాణ పదాన్ని పలకడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడడం లేదు. తెలంగాణ ఏర్పాటు పట్ల మోదీకి ఉన్న కక్షను మరోసారి చాటారు' అని రేవంత్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

**ఏపీకి సరే మా సంగతేంటి..?**

'ఏపీకి ఎన్నిరకాలుగా కేటాయింపులు చేయాలో అన్ని రకాలుగా కేటాయించారు. ఏపీకి ఎందుకు నిధులు ఇస్తున్నారు..? అని మేం అడగడం లేదు. పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్టు ఏపీకి నిధులు కేటాయించారు. తెలంగాణ విషయంలో ఇంత కక్ష ఎందుకు?. గుజరాత్‌కు ఎలా నిధులు కేటాయించారో, మూసీకి అలా నిధులు కేటాయించామని ప్రధాని మోదీని అడిగాను. హైదరాబాద్‌కు నిధులు ఇస్తే దేశ ఎకానమికి ఉపయోగపడుతుందని మోదీకి వివరించాను. పదేండ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఐటీఐఆర్ కారిడార్ మరుగున పడింది. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ స్లోగన్ బోగస్ అని బీజేపీ నిరూపించింది. వికసిత్ భారత్‌లో మా రాష్ట్రం ఉండదా?' అని కేంద్రంపై రేవంత్ ప్రశ్నల వర్షం కురిపించారు.

**కుర్చీ బచావో..!**

'కేంద్ర బడ్జెట్ కుర్చీ బచావో బడ్జెట్‌లాగా ఉంది. ఇంత కక్షపూరిత బడ్జెట్ గతంలో ఎప్పుడూ లేదు. తెలంగాణ ఓట్లు, సీట్లు మాత్రమే బీజేపీకి కావాలని ఎన్నికల ముందే చెప్పాను. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత వహించి మోదీ మంత్రివర్గం నుంచి తప్పుకోవాలి. ప్రతి రాష్ట్రంలో ఐఐఎం ఉంది. తెలంగాణకి ఇవ్వండి అని లేఖ రాశాను. తెలంగాణకు ఐఐఎం ఇవ్వము అని ధర్మేంద్ర ప్రధాన్ మూడు రోజుల క్రితం లేఖ రాశారు. కేంద్ర బడ్జెట్ ఏపీ, బీహార్ కోసమే పెట్టినట్టు ఉంది. కుర్చీ లాలూచీలో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. మా ఎంపీలతో పార్లమెంట్‌లో నిరసన తెలియచేస్తాం. తెలంగాణకి అన్యాయం జరుగుతుంటే తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు చూస్తూ ఊరుకోరు. ఏపీ పునర్విభజన చట్టంలో ఏపీకి ఇవ్వాల్సిన అంశాలతో పాటు తెలంగాణకి ఇవ్వాల్సిన అంశాలు ఉన్నాయి. బడ్జెట్ సవరించే అవకాశం ఉంది. బడ్జెట్ సవరించి మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఫార్మా విలేజ్ నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలి. బీజేపీ చేతకానీ తనం, బానిస మనస్తత్వం వల్ల తెలంగాణ అన్యాయం అవుతోంది' అని కేంద్రంపై రేవంత్ మండిపడ్డారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలం 25న మేడిగడ్డ పర్యటనకు వెళ్తాం

ఈ నెల 25న అసెంబ్లీలో బడ్జెట్ అనంతరం.. అదేరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా మేడిగడ్డ పర్యటనకు బయలుదేరుతుందని.. 26న కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించనున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రకటించారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కోవా లక్ష్మి, విజయుడు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవితో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీకి చెరో ఎనిమిది సీట్లలో గెలిపిస్తే.. బడ్జెట్‌లో తెలంగాణకు గాడిదగుడ్డు ఇచ్చారన్నారు.

**బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు నిరసన తెలపాలి..**

రేపు పార్లమెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం కేసీఆర్ అధ్యక్షతన 3గంటల పాటు జరిగిందన్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూధనచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ఎల్పీ మిగతా కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ నెల 25న అసెంబ్లీలో బడ్జెట్ అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ బృందం మేడిగడ్డకు బయలుదేరుతుందన్నారు. 26న మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో వృథాగా పోతున్నా ప్రభుత్వం పంపుల ద్వారా ఎత్తిపోయడం లేదని విమర్శించారు. మిడ్



మానేరు, కొండ పోచమ్మ సాగర్, రంగ నాయక సాగర్‌లో నీరు నింపి రైతుల పొలాలకు తరలించాలని ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతామన్నారు.

**నిరుద్యోగ సమస్యపై వాయిదా తీర్మానం**

ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు ఎల్పీ సమావేశంలో కార్యాచరణ ఖరారు చేశామన్నారు. నిరుద్యోగుల సమస్యలపై రేపు చర్చ కోసం రేపు అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడునెలల్లో పాల్పడ్డ కుంభకోణాలపై అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. పౌరసరఫరాలశాఖలో కుంభకోణాలు జరిగాయని.. వాటిని లేవనెత్తనున్నట్లు తెలిపారు. వేరే రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను ఇక్కడ ప్రవేశ పెట్టేందుకు చేసిన ప్రయత్నాల వెనుక ఉన్న అదృశ్య శక్తుల బండారాన్ని బయట పెట్టాలని అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. మంత్రికి తెలియకుండానే నిషేధిత బీర్ల ప్రవేశం కోసం ప్రయత్నం ఎలా జరిగింది అనే దానిపై చర్చకు పట్టుబడుతామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై అసెంబ్లీలో ప్రస్తావిస్తామన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో మిగిలి పోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తమ ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు.

**పార్టీ ఫిరాయింపులపై ప్రత్యేక వ్యూహంతో..**

ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ అన్న ఆయన.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియలో జాప్యంపై నిలదీస్తామని చెప్పారు. రైతు భరోసాలో ఆలస్యంపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నట్లు తెలిపారు. ఫిరాయింపులపై అసెంబ్లీలో ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తామన్నారు. కేసీఆర్ అన్ని అంశాలపై తమకు దిశానిర్దేశం చేశారన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య సత్సంబంధాల కోసమే మంత్రులతో భేటీలు అన్న రేవంత్ ఇప్పుడు చెబుతారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ తెలంగాణకు జరిగిన అన్యాయంపై మాట్లాడారా? అంటూ నిలదీశారు. రాహుల్ గాంధీతో తెలంగాణకు జరిగిన అన్యాయంపై రేవంత్ మాట్లాడించాలని.. ప్రధాని కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఎంపీలు ధర్నా చేయాలన్నారు. పార్లమెంట్ పోడియం దగ్గరకు వెళ్లి కాంగ్రెస్ బీజేపీ ఎంపీలు నిరసన తెలిపాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎల్పీ సమావేశానికి ముందస్తు అనుమతితోనే కొందరు ఎమ్మెల్యేలు భేటీకి హాజరుకాలేదని తెలిపారు.

# పెద్దవాగు ప్రాజెక్టు గండికి అసలు కారకులెవరు

**ఖమ్మం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు గండికి అసలు కారకులెవరు.? రెండు తెలుగు రాష్ట్రాల నడుమ ఉన్న ఈ ప్రాజెక్టుకు భారీ గండి పడి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లడానికి బాధ్యులెవరు.? ఈ గండి పడటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్లక్షమే కారణమా.? లేక తెలంగాణ ప్రభుత్వ ఏమరుపాటు కారణమా..? ఇప్పుడు ఈ ప్రశ్నలు ఇరు రాష్ట్రాల ప్రజల మెదళ్లను తొలుస్తున్నాయి. ఈ ప్రాజెక్టుకు పడిన భారీ గండితో రూ.150 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. 1975వ సంవత్సరంలో ఈ మధ్యతరహా ప్రాజెక్టును నాటి రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామ సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మితమైంది. అయితే రాష్ట్రం విడిపోయిన తర్వాత ఈ ప్రాజెక్టు తెలంగాణలో మిగిలిపోగా దీని కింద సాగయ్యే ఆయకట్టు మొత్తం ఆంధ్రప్రదేశ్ లో భాగమైంది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఇరు రాష్ట్రాలతో అనుబంధం ఏర్పడింది. తాజాగా భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల సామర్థ్యం, క్రస్ట్ గేట్ల పని తీరుపై రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. పెద్ద వాగు ప్రాజెక్టుకు గండి పడిన తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో చీఫ్ ఇంజనీర్లు ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఏఈలు క్షేత్ర స్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో నలుగురు అధికారులను బాధ్యులను చేస్తూ వారికి మెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి కారణంగా సుమారు రూ.150 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. గండి కారణంగా వరద పోటెత్తి



కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఊళ్లకు ఊళ్ళు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సి వచ్చింది. కాగా పెద్ద వాగు ప్రాజెక్టు పరిశీలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయి పరిశీలనకు రానున్నాయి. పెద్దవాగు ప్రాజెక్ట్ 1975లో ప్రారంభమై 1981 లో నిర్మాణం పూర్తి చేసుకుందని మంత్రుల తుమ్మల తెలిపారు. రాష్ట్ర విభజన తో ప్రాజెక్ట్ తెలంగాణలో, ఆయకట్టు ఆంధ్రాలో ఉందన్నారు. గత ప్రభుత్వాలు ప్రాజెక్ట్ మరమ్మత్తులు చేయకపోవడం వల్ల ప్రాజెక్ట్ కట్ట కోతకు గురైందని చెప్పారు. "గుబ్బల మంగమ్మ అటవీ ప్రాంతంలో 31 సెంటి మీటర్ల భారీ వర్షం వల్ల 80 వేల క్యూసెక్కుల వరద నీరు పోటేత్తడంతో కట్ట మూడు చోట్ల గండ్లు పడి వరద నీరు సమీపంలోని గుమ్మడివల్లి, కొత్తూరు, నారాయణపురం గ్రామాలతో పాటు వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలను ముంచెత్తింది. తెలంగాణ ప్రాంతంలో పంట నష్టపోయిన రైతులని ఆదుకోవటానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో ఉన్నారు" అని తుమ్మల చెప్పారు. "ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో గతంలో 1989 లో ఈ ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోయింది. మళ్ళీ 35 ఏళ్ల తరువాత భారీ వర్షాలు, వరదల వల్ల ప్రాజెక్ట్ ఆనకట్ట తెగింది. వరదలో చిక్కిన 30 మందిని ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకొని కాపాడాం " అని వెల్లడించారు. "భారీ వర్షాలు, వరదల వల్ల గండి పడ్డ పెద్దవాగు ప్రాజెక్ట్ స్థితిగతులు, నష్టపోయిన రైతుల గురించి సీఎం రేవంత్ రెడ్డి కి వివరించాం. పెద్దవాగు వరద బీభత్సం వల్ల నష్టపోయిన రైతాంగం వివరాలు సేకరించాల్సిందిగా సీఎం రేవంత్ సూచన చేశారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా పంట నష్టపోయిన రైతులు వివరాలు సేకరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను ఆదేశించాం. నష్టపోయిన రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ఇన్పుట్ సబ్సిడీ అందజేతపై ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఆస్తి నష్టం జరిగిన వారికి, పంట నష్టం జరిగిన రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ప్రాజెక్ట్ మరమ్మతుల కోసం ఇరు రాష్ట్రల అధికారులు సమావేశం నిర్వహించి తగిన కార్యచరణ చేస్తాం." అని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## ఎడ్యుకేషన్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్:** ఎడ్యుకేషన్ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డే స్కూల్ కాకుండా సెమీ అండ్ రెసిడెన్షియల్ పాఠశాలలు త్వరలోనే ప్రారంభం కాబోతున్నాయని ప్రకటించారు. ఇప్పుడున్న ప్రభుత్వ విద్యకంటే నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని వివరించారు. ఈరోజు (మంగళవారం) తెలంగాణ సచివాలయంలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ... ఒక్కో పాఠశాల కోసం రూ.80 నుంచి రూ. 100 కోట్లు ఖర్చు చేయబోతున్నామని అన్నారు. ఒక్రేజ్, బిర్లా ఓపెన్ స్కూల్స్ టైప్ ప్రభుత్వ పాఠశాలలు రాబోతున్నాయని చెప్పారు. ప్రతీ మండలానికి రెండు లేదా మూడు పాఠశాలలు తొలుత రాబోతున్నాయని అన్నారు. రుణమాఫీపై ప్రతిపక్షాలు హైదరాబాద్‌లో కూర్చొని మాట్లాడొద్దని హితవు పలికారు. రుణమాఫీపై ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. స్మితా సబర్వాల్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారన్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వానికి ఏం సంబంధం? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. బీఏసీలో బీఆర్ఎస్ నేతలు పేర్లు మార్చుకున్నారని.. అందుకే ఆ సమావేశం ఆలస్యమైందని చెప్పారు. తమది ప్రజా ప్రభుత్వమని.. ప్రతీ అంశంలో ప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## కేంద్ర బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరం

**హైదరాబాద్ :** తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ తెలంగాణ రాష్ట్రానికి కూడా ఏమైనా భారీగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశించాం.. దక్కింది శూన్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ స్పందిస్తూ.. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు.



రూ. 48 లక్షలు ఇరవై ఒక్కవేల కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారు. తెలంగాణ రాష్ట్రానికి మరొకసారి దక్కింది గుండు సున్నానే అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టంలో దాదాపు 35 హామీల పైన నిర్ణయం తీసుకోవాలని గతంలో కేసీఆర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అనేకసార్లు అభ్యర్థిస్తూ లేఖలు కూడా రాశాం. ములుగు యూనివర్సిటీకి అదనపునిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ.. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేవటం లేదు అని కేటీఆర్ తెలిపారు.

ఐఐఎం సహా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి కేంద్ర జాతీయ సంస్థలను ఇవ్వమని మేము కోరినప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు. తెలంగాణ నుంచి ముంబై- నాగపూర్, బెంగళూరు- చెన్నై వంటి మార్గాల్లో పారిశ్రామిక కారిడార్లకు నిధులు అడిగినప్పటికీ వాటి గురించి స్పందన లేదు. మెగా పవర్ లూమ్ క్లస్టర్‌తో పాటు నూతన హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అడిగిన కూడా కేంద్రం స్పందించలేదన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు వెళ్లి ఢిల్లీలో అడిగిన వాటిని కూడా పట్టించుకోలేదు. తెలంగాణకు మరోసారి ఈ కేంద్ర బడ్జెట్లో దక్కింది గుండు సున్నా. తెలంగాణలో 16 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి. 16 స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కి దక్కిన నిధులను చూసైనా తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలి. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్న విషయాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరముంది. ఎందుకు ప్రాంతీయ శక్తులను బలోపేతం చేసుకోవాలో మరోసారి ఈ బడ్జెట్ తెలియజేస్తోందన్నారు కేటీఆర్. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఒక్క మాట కూడా పార్లమెంట్‌లో మాట్లాడలేదు. ఇదే గులాబీ కండువా కప్పుకున్న ఎంపీలు పార్లమెంట్‌లో గనుక ఉంటే కేంద్ర వ్యతిరేక వైఖరిని గట్టిగా వ్యతిరేకించే వాళ్ళు. 8 మంది ఎంపీలను ఇచ్చినా బీజేపీ ప్రభుత్వం గుడ్డు సున్నా నిధులు ఇచ్చినందుకు తెలంగాణ ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధులు ఎక్కువ ఇచ్చినందుకు మాకు ఏం బాధ లేదు. సోదర రాష్ట్రంగా వారికి వచ్చిన కేటాయింపులపైన, వారు బాగుండాలని కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం పేరు చెప్పిన ప్రతిసారి ఎక్కడ కూడా తెలంగాణ అనే పదం ప్రస్తావించలేదు. రాజధాని అమరావతి కోసం, పోలవరంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తామని చెప్పారు. ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్లకు ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన భారీ నిధుల పట్ల మాకు ఎలాంటి దుగ్ధలేదు.. సంతోషమే. కానీ ఆంధ్రప్రదేశ్, బీహార్‌కు మాత్రమే ఇచ్చి మిగిలిన 26 రాష్ట్రాలను చిన్న చూపు చూడడం నిజంగా బాధాకరం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం పేరు చెప్పిన మీరు తెలంగాణ రాష్ట్ర డిమాండ్లను మాత్రం పట్టించుకోలేదు అని కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ఆచరణతో ముందుకు పోతున్నాం

-మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన ఏ ఒక్క హామీని విస్మరించదని స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ఆచరణతో ముందుకు పోతున్నామని అన్నారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై స్పీకర్‌దే తుది నిర్ణయమని చెప్పారు. ప్రతిపక్షాలు ఇచ్చిన అంశాలపై స్పీకర్ పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటారని అన్నారు. లా అండ్ ఆర్డర్ , రుణమాఫీ, స్థానిక సంస్థలపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదని చెప్పారు. రైతు సమస్యలంటూ బీజేపీ మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. తెలంగాణ అవసరాల దృష్ట్యా ఎక్కువ నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని అన్నారు. తెలంగాణకు చట్ట ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సాధించటంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. నిధుల విషయంలో కేంద్రంపై పోరాటం చేస్తామని అన్నారు. విభజన చట్టానికి సంబంధించి ఏపీకి ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు కూడా ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణపై కేంద్రం చిన్న చూపు చూస్తోందని మండిపడ్డారు. రాష్ట్రానికి నిధుల విషయంలో కేంద్రంపై బీజేపీ నేతలు ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రతిపక్షం అడిగిన ప్రతి అంశంపై చర్చిస్తామని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీని సీఎంచ రేవంత్‌రెడ్డి కలిస్తే బీజేపీకి దగ్గర అయినట్టు కాదని తేల్చిచెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసినట్టు బీజేపీ, కాంగ్రెస్ కలవదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## వరదలతో అతలాకుతలం

**అదిలాబాద్ :** మంచిర్యాల జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోనీ పలు గ్రామాలకు లోలెవల్ వంతెనలు నీట మునిగి పలు చోట్ల తాత్కాలిక వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయి. చెన్నూర్ మండలంలో భారీ వర్షాలకు అక్కేపల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో అక్కేపల్లి, శివలింగాపూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించిన పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి కావడంతో ప్రతీ యేటా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రతీ యేటా వర్షా కాలంలో వాగు ఉప్పొంగడం జనం ఇబ్బంది పడటం కామన్ అయిపోయింది. వాగుపై వంతెన నిర్మించాలని ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామం వద్ద గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతు వాగు లో లెవల్ వంతెన కొట్టుకుపోయింది. దీంతో సుమారు ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాజాగా.. శనివారం లోతు వాగు వంతెన దాటే క్రమంలో ఓ ద్విచక్రవాహనదారుడు అదుపు తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు ఆయనని రక్షించారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్, రామగుండం సిపి శ్రీనివాస్ సూచించారు. అధికారులు సైతం అప్రమత్తంగా ఉండి అత్యవసర సమయాల్లో సహాయక చర్యలు అందించేలా సిద్ధంగా ఉండాలన్నారు.

# బీజేపీ పార్టీ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశంలో హాజరైన రాష్ట్ర అధికార ప్రతినిధి విట్టల్

వాస్తవ నేస్తం,పటాన్చెరు: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి విట్టల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పదాధికారులు రాష్ట్ర నాయకులు మండల అధ్యక్షులు తదితరులు పాల్గొని జిల్లా పార్టీ తరఫునుండి మొదటగా రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెత్తారు. తదుపరి వ్యవసాయ తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో స్థానిక ఎలక్షన్లో గ్రామపంచాయతీలో సర్పంచ్ మరియు జెడ్పిటిసిలు ఎంపీటీసీలు అధిక సంఖ్యలో మరియు కౌన్సిలర్లు కార్పొరేటర్లు అధిక సంఖ్యలో గెలుపు దిశగా మనందరం కృషి చేయాలని ప్రతి కార్యకర్త నేను సైతం ఒక నరేంద్ర మోడీ లాగా పని చేస్తానని ముందుకు సాగాలని గోదావరి అంజి రెడ్డి అన్నారు మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి విట్టల్ మాట్లాడుతూ మన గత ఎలక్షన్లో రాష్ట్రవ్యాప్తంగా వన్ పర్సెంట్ మాత్రమే ఓటు బ్యాంకు తక్కువ ఉంది ఈసారి ప్రతి కార్యకర్త దేశం పట్ల



హిందుత్వం పట్ల మనకున్న భక్తిని చాటినట్లయితే ముందువంచలో మనమే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ మండల అధ్యక్ష బరిలో ముస్రాన్ అహ్మద్

వాస్తవ నేస్తం,భీంపూర్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 5 తేదీ వరకు ఆన్లైన్ ద్వారా నిర్వహించే యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని గోన గ్రామానికి చెందిన ముస్రన్ అహ్మద్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్ష బరిలో ఉంటున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన గడువులోగా తన మెజార్టీ సాధించి, మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు ఆన్లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేశారు. 18-35 సంవత్సరాల లోపు యువకులు ఐవైసి యాప్ ద్వారా ఆన్ లైన్ ఓటింగ్లో పాల్గొనలన్నారు.



## మండలంలో మై ఆటో ఇస్ సేఫ్ కార్యక్రమం ప్రారంభం

**- ఆటోలకు స్టిక్కరింగ్ చేసిన సీఐ సుధీర్ కుమార్**

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండల కేంద్రంలో మై ఆటో ఇస్ సేఫ్ కార్యక్రమాన్ని సిఐ సుధీర్ కుమార్, ఎస్ఐ నాగలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సురక్షిత ప్రయాణం మై ఆటో ఇస్ సేఫ్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో ఆటో డ్రైవర్ సీటు వెనకాల క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి స్క్రీన్ షాట్ తీసి పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే ఆపదను గుర్తించి స్పందిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోపోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



# ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలి





**నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలి**

**ఈ ఎఫ్ఐఆర్ లను నమోదు చేయాలి**

**జిల్లా ఎస్పీ గౌష్ ఆలం**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలను వాటి స్థితిగతులను పరిశోధన విధానాన్ని పరిశీలించడానికి జిల్లా పోలీసు అధికారులతో మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో పలు సూచనలు చేశారు. నిరంతరం గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకొని గ్రామాలపై పూర్తి పట్టు సాధించాలని సూచించారు. ప్రజలలో ప్రస్తుతం సైబర్ నేరాలపై, బాల్యవివాహాలు ఆసాంఘిక కార్యకలాపాలపై పూర్తిగా సవివరంగా వివరించి ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలను సేవించకుండా, వినియోగించకుండా, అదేవిధంగా మాయ మాటలు చెప్పే దళారుల చేతిలో మోసపోయి వాటిని పండించడం వల్ల ప్రభుత్వం వల్ల వచ్చే సత్ఫలితాలను కోల్పోయి, పోలీసు కేసుల బారిన పడతారని అన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితుల ధనాన్ని తిరిగి వచ్చే విధంగా కోర్టులను, బ్యాంకులను సంప్రదించి బాధితులకు న్యాయం చేకూరే విధంగా కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ ను, పరిసరాలను, పోలీసు కార్యాలయాలను ప్రతిరోజు శుభ్రపరుస్తూ పరిశుభ్రతను పాటించాలన్నారు. తరచూ ఆసాంఘిక కార్యకలాపాలకు, నేరాలకు పాల్పడే వారిపై రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎటువంటి అలసత్వం లేకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో టెస్టులు నిర్వహిస్తూ



ఉండాలని సూచించారు. నూతన చట్టాలపై ప్రతి ఒక్క సిబ్బంది కి అవగాహన కల్పిస్తూ ప్రత్యేకంగా శిక్షణను పోలీస్ స్టేషన్లో వారీగా అందించాలని సూచించారు. నూతన చట్టాలలో భాగంగా సామాజిక మాధ్యమాలలో మరియు ఇమెయిల్ ద్వారా వచ్చే అభ్యర్థనలపై ఈ ఎఫ్ఐఆర్ లను నమోదు చేసి విచారణ చేపట్టాలని సూచించారు. పట్టణ ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలను ప్రజలు అమర్చుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**బాదితులకు మొబైల్ ఫోన్లు అందజేత...**

జైనథ్, బేల పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ కారణాలతో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల 14 మొబైల్ ఫోన్ లను విచారణలో కనుగొని మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని సమావేశ మందిరం నందు తిరిగి బాధితులకు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అందజేశారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న, దొంగలించబడిన వెంటనే సిఈఐఆర్ వెబ్ పోర్టల్ నందు ఫిర్యాదులను నమోదు చేయాలని లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు పోతారం శ్రీనివాస్, జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, హసిబుల్ల, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది డిసిఆర్బి, ఎన్ఐబి, ఐటి కోర్, పోలీసు కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీఓకు ఘన సన్మానం..



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళున్న ఎంపీఓ మారుతి ని, ఎంపిడిఓ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఘనంగా సన్మానించారు. ఈ వీడ్కోలు సన్మాన సభ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... ఉద్యోగరీత్యా ప్రతి ఉద్యోగికి బదిలీ అనేది తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆయన ఉమ్మడి మండలాలలోని ఎంపీఓ నిధులు మరువలేమని ఆయన కొనియాడారు. ఆయన మండల సిబ్బంది కార్యదర్శులతో మమేకంగా ఉంటూ విధి నిర్వహణలో ఎలాంటి మచ్చ లేకుండా పనిచేసిన వ్యక్తి అని అన్నారు. ఆయన వర్ని మండలానికి వెళ్తున్న శుభ సందర్భంగా అక్కడ కూడా మండల సిబ్బందితో గ్రామపంచాయతీ కార్యదర్శిలకు విధి నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఉద్యోగాన్ని చేపట్టి మన్ననలు పొందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో. సూపర్ డెంట్ శ్రీనివాస్, ఏపీఓ గంగారం,జిపి కార్యదర్శులు యాదవ్ ఉమాకాంత్ ప్రతాప్ రాము స్వప్న ప్రియాంక శ్రీవాణి కవిత సునంద రాజేశ్వరి నిర్మల మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో ఘనంగా మాజీ డిసిసిబి జన్మదిన వేడుకలు



**వాస్తావ నేస్తం,కోటగిరి:** ఉమ్మడి మండల కేంద్రలాలో ప్రజా ప్రతినిధులు,నాయకులు మాజీ డిసిసిబి చైర్మన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసి శంకర్ పటేల్ పాల్గొని కేకును కట్ చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు చాగం కృష్ణారెడ్డి మాట్లాడుతూ... పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులతో కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మాజీ డిసిసిబి చైర్మన్ కు కొత్తపల్లి గ్రామస్తుల తరఫున కాంగ్రెస్ పార్టీ నాయకుల తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం శంకర్ పటేల్ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు అరటిపళ్ళు బిస్కెట్ ప్యాకెట్లు కేకును పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుప్పల దత్తాత్రి ఏఎంసి చైర్మన్ అబ్దుల్ హమీద్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పుప్పల సైదయ్య లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 5లోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



**వాస్తవనేస్తం,బజార్హత్నూర్:** జూన్ 28 వరకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొంది, ఇప్పటి వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు ఆగస్టు 5 లోగా దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయా విస్తరణ అధికారి క్రిష్ణపాల్ తెలిపారు. గతంలో రైతు బీమా పొందిన రైతులు మార్పులు చేర్పులకు లేదా నామిని మరణిస్తే మార్పులకు ఈ నెల 30 లోగా దరఖాస్తు సమర్పించాలన్నారు. దరఖాస్తుకు రైతు పట్టాదార్ పాసు పుస్తకం లేదా తహసీల్దారు డిజిటల్ సంతకం అయిన ధ్రువపత్రం, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలు అవసరమని, 18 పైబడి 59 ఏళ్ల లోపు వారు మాత్రమే బీమాకు అర్హులని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్,చంద్రయ్య, లక్ష్మన్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కానీ రైతులకు అవగాహన

**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలంలోని బట్టాపూర్ గ్రామపంచాయతీలో ఏఈఓ సాయి సచిన్ లక్ష రూపాయల వరకు రుణమాఫీ కానీ వారి వివరాలు తెలుసుకొని, రుణాలు మాఫీ కాని వారికి ఆన్లైన్లో చూసి రైతులకు వివరించారు. పలువురు రైతులకు సంబంధించి వివరాలు తప్పులు ఉండడంతో సరి చేసుకోవాలని సూచించారు. రైతులందరికీ ప్రభుత్వం రూ.2 లక్షల లోపు రుణ మాఫీ చేస్తున్న అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు దయానంద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం అందజేత

వాస్తవ నేస్తం,పటాన్చెరు: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మంగంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి ఎల్లమ్మ గూడ మాజీ సర్పంచ్ ధర్మశెట్టి రవీందర్ లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ధర్మశెట్టి రవీందర్ మాట్లాడుతూ.. నూతన ఆలయ నిర్మాణాలకు తన వంతు సహకారంగా అందించానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొనడం జరిగింది.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com